క్లుప్తంగా

విరిగిపడిన కొండ చరియలు


బంద్రసింగి రోడ్డులో బండరాయి తొలగిస్తున్న గిరిజన యువకులు

భామిని: మండలంలోని తివ్వా కొండ పరిసరాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు కొండ చరియలు విరిగి పడి, బండరాళ్లు రోడ్డుపైకి రావడంతో ఆదివాసీ గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొండపై వాగులు ఉప్పొంగడంతో ఘాట్ రోడ్డుపై రాళ్లు పడుతున్నాయని గిరిజనులు చెబుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో గిరిజనులే స్వయంగా రాళ్లు తొలగించుకున్నారు.

ప్రజావేదిక రేపు

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకానికి సంబంధించి ఈ నెల 22న ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు మండలంలోని 25 పంచాయతీలలో నిర్వహించిన ఉపాధి హామీ పనులను, పింఛన్లపైన సామాజిక తనిఖీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పనులకు సంబంధించి గ్రామాలలో ఈ నెల 2 నుంచి 21వరకు సామాజిక తనిఖీ బృందంచే తనిఖీలు నిర్వహించి ఆయా గ్రామాలలో గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు ప్రజావేదికను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

23న నేత్ర వైద్య శిబిరం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి, విజయనగరం వారి సహకారంతో ఈ నెల 23న ఉదయం 9 గంటల నుంచి కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు శ్రీషిర్డీ సాయిదేవ సంస్థానం కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి పరీక్షలకు వచ్చే వారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఫోన్ తీసుకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు 9110386596, 80089330098 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సందర్శన

సీతంపేట: ఐటీడీఏలో నిర్వహిస్తున్న గర్భిణుల వసతిగృహాన్ని శ్రీకాకుళం డీఎంహెచ్ఓ అనిత బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే భోజన, వసతి సదుపాయాలపై ఆరా తీశారు. అంతకముందు సీతంపేట ఐటీడీఏ పరిధిలో శ్రీకాకుళం జిల్లాలో ఉన్న పది పీహెచ్సీల సీనియర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

భామిని: మండలంలోని లివిరి వద్ద వర్షాలకు కొట్టుకుపోయిన తారురోడ్డుకు బుధవారం యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. గ్రామస్తుల ఒత్తిడి మేరకు రోడ్డు కాంట్రాక్టర్ వచ్చి గ్రావెల్ వేసి పూడ్చివేత పనులు ప్రారంభించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముంపులోనే పంట పొలాలు

భామిని: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో పొలాలు నీటమునిగాయి. లివిరి వద్ద కనపల చెరువుకు గండి పడడంతో లివిరి, దిమ్మిడిజోల గ్రామాల్లో లోతట్టు పొలాలన్నీ నేటికీ ముంపులోనే ఉన్నాయి. అలాగే నులకజోడు, బిల్లుమడ, బాలేరు, సొలికిరి గ్రామాల్లోని పొలాలు కూడా నీటిలోనే ఉన్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇదిలా ఉంటే పొలాల్లోని నీటిని బయటకు పంపించిన తర్వాత ఎరువులు వేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

పాలకొండ రూరల్: డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మానుకొండ శ్యామ్‌బాబు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 26లోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. బీఏ ఎకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీకామ్ జనరల్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ జువాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

సకాలంలో రహదారి నిర్మాణం పూర్తి చేయాలి

కురుపాం: నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ బి.టి.రహదారి నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఇన్‌చార్జ్ ఎస్.ఈ జి.రవి ఆదేశించారు. మండలంలోని నాబార్డ్ నిధులు రూ.130 లక్షలతో పునర్నిర్మాణం జరుగుతున్న టి.జి రోడ్డు ఉదయపురం వయా కలిగొట్టు రహదారి, పీఎం జన్మాన్ పథకం నిధులతో నిర్మాణం జరుగుతున్న గుజ్జువాయి -డేరింగ్ పాడు బీటీ రహదారి నిర్మాణం పనులు ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణానికి సంబంధించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఈఈ లోకనాథం, ఏఈఈ కె.మురళీధర్ తదితరులు ఉన్నారు.

తొలి పూజకు సమాయత్తం

- సాంప్రదాయంతో పాటు నిబంధనలు తప్పనిసరి
- పోలీస్, విద్యుత్ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సిందే
- ఘర్షణలకు తావు లేకుండా ఉత్సవ కమిటీలదే బాధ్యత
- వినాయక మంటపాల వద్ద జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు



పాలకొండ రూరల్: విఘ్నములు తొలగించు గణపతి నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు అన్ని వర్గాల వారు సమాయత్తమవుతున్నారు. సాంప్రదాయాల తొలి పండగను అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గణపతి ఉత్సవాలను ఏ విధంగా భక్తులు నియమ నిష్ఠలతో చేపడతారో.. అలాగే ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలపై దృష్టి పెట్టాలని పోలీస్, విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న వినాయక ఉత్సవాలకు సమాయత్తమవుతున్న ఉత్సవ కమిటీలు ఇప్పటికే మండపాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మండపాల ఏర్పాటు, విద్యుత్ అలంకరణల విషయంలో సంబంధిత శాఖ అనుమతులు, సూచనలు పాటిస్తే అపశ్రుతులకు తావు లేకుండా పండగ వాతావరణం చివరి వరకూ కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.

ఇలా చేస్తే మేలు..

విగ్రహ ఏర్పాటుకు కమిటీలు తప్పనిసరిగా ముందస్తు పోలీసుల అనుమతులు పొందాలి. వివాదస్పద స్థలాలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ప్రాంతాల్లో మండపాలు లేకుండా ముందుగానే చూసుకోవాలి. విగ్రహాల, మండపాల వద్ద ఏర్పాటు చేసే సౌండ్ బాక్సులు, మైక్‌సెట్లకు అనుమతులు తప్పనిసరి. మితిమీరిన సౌండ్ నిషిద్ధం. ప్రత్యేక మండపాల వద్ద విద్యుత్ శాఖ అధికారుల అనుమతులతో తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లను శాఖాపరమైన అధికారుల పర్యవేక్షణలో ఏర్పాటు చేయాలి. విద్యుత్ చౌర్యానికి పాల్పడటంతో అనేక అనర్థాలు పొంచి ఉంటాయి. అధికారులు గుర్తిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులు కావాల్సి వస్తోంది. ఎటువంటి అపశ్రుతులు చోటు చేసుకున్నా ఉత్సవ కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఉత్సవ నిర్వహణకు సంబంధించి బలవంతపు చందాలు, వసూళ్లకు పాల్పడరాదు. ఇలా చేస్తే చట్టరీత్యా నేరం. మసీదులు, చర్చిల సమీపంలో మండపాలను ఏర్పాటు చేసే వారు నమాజ్, ప్రార్థనలు జరిగే ప్రత్యేక సమయంలో వారికి సహకరించే విధంగా సౌండ్ సిస్టమ్‌లను పూర్తిగా నిలుపు చేయాలి. అనుమానిత వ్యక్తులను, ఏదైనా సందేహాలు మండపాల వద్ద గుర్తిస్తే తక్షణమే పోలీసులకు తెలియపర్చాలి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా శ్రేష్ఠ మైన మట్టి విగ్రహాలను ప్రతిష్ఠంచటం మేలు. రాత్రి 10 గంటల తరువాత మండపాల వద్ద కార్యక్రమాలను బంద్ చేయాలి. మైక్ సెట్లను ఆపివేయాలి. విగ్రహాల నిమర్జన సమయంలో తగు నిబంధనలు పాటించాలి. వీలైనంతమేరకు నిమజ్జనాలు రాత్రి 9 గంటలలోపు పూర్తి చేస్తే మేలు. బాణసంచా వాడకం సరికాదు.


విగ్రహం తయారుచేస్తున్న కళాకారుడు

ఆధ్యాత్మిక చింతనతో వేడుకలు జరుపుకోవాలి



గణపతి నవరాత్రి వేడుకలను ప్రజలు ఆధ్యాత్మిక చింతనతో జరుపుకోవాలి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకూడదు. ఉత్సవ కమిటీలు, మండపాల వద్ద పర్యవేక్షకులు భక్తులు, ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. హద్దు మీరితే చట్టపరమైన చర్యలు తప్పవన్న విషయంపై చైతన్యం పెంచుకోవాలి.- ఎం.రాంబాబు, డీఎస్పీ, పాలకొండ

భక్తుల, నిర్వాహకుల భద్రత ముఖ్యం



గణపతి నవరాత్రి ఉత్సవాలను అన్ని వర్గాల ప్రజలు సందడిగా జరుపుకోవాలి. ఈ క్రమంలో భక్తుల, నిర్వాహకుల భద్రతకు అధిక ప్రాధాన్యం కల్పించాలి. ముందస్తుగా మా శాఖను సంప్రదిస్తే విద్యుత్ సరఫరా ఏర్పాట్లుకు అవసరమగు అనుమతులు అందిస్తాం. ప్రస్తుత వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి. మండపాల వద్ద ప్రత్యేక మీటర్లు ఏర్పాటు చేస్తాం. ముందస్తు దరఖాస్తు చేసుకుంటే ఉన్నతాధికారుల సూచనల మేరకు విద్యుత్ సరఫరాను మా సిబ్బంది పర్యవేక్షణలో చేపడతాం.
– ఎల్.యోగి, ఏఈ విద్యుత్ శాఖ, పాలకొండ

దోమలను నిర్మూలిద్దాం..

- ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు


సీతంపేట: ర్యాలీ ప్రారంభిస్తున్న ఏపీఓ చిన్నబాబు

సీతంపేట: దోమలను సమూలంగా నిర్మూలిద్దామని ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక జిల్లా మలేరియా నివారణ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ స్థానిక ఏరియా ఆస్పత్రి వరకు సాగింది. అనంతరం మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అంతకుముందు సర్ రోనాల్డ్‌రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎంఓ పి.వి.సత్యనారాయణ, డీడీ అన్నదొర, ఎంపీడీఓ కె.సత్యం, సూపరింటిండెంట్ శ్రీనివాసరావు, వైద్యాధికారి శివశంకర్, సహాయ మలేరియా నివారణ అధికారి శ్రీనివాసరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు, కన్సల్టెంట్ శ్రీకాంత్, సీహెచ్‌డబ్ల్యూఓలు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా జీవిద్దాం..

పాలకొండ రూరల్: దోమలను నివారిద్దాం.. ఆరోగ్యంగా జీవిద్దామని మండలంలోని అన్నవరం, ఎం.సింగుపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు సూచించారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో బుధవారం అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యులు బి. అంకిత, ఎస్. రవికుమార్ మాట్లాడుతూ.. పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. చిన్నపాటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా తక్షణమే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమాల్లో డాక్టర్ ఆర్.సుజయ్‌కుమార్, సిబ్బంది జగదీష్‌కుమార్, తేజా, శారద, చలపతిరావు, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కూటమిది మోసపూరిత పాలన


కిమ్మిలో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం

వీరఘట్టం: కూటమి ప్రభుత్వం మోసపూరిత పాలన కొనసాగిస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. మండలంలోని కిమ్మి, పీవీఆర్ పురం గ్రామాల్లో బుధవారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి హామీలు అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయినదీ వివరించారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయని కూటమి నాయకులు వస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో కిమ్మి సర్పంచ్ గురాన రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన


టొబ్బనలో పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుమ్మంగి పంచాయతీ పరిధిలోని టొబ్బన, సంధిగూడ, బాసంగి, కొరటిగూడ గ్రామాల్లో పీఎం జన్‌మన్ పథకం ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో పి.త్రివిక్రమరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇళ్ల ప్రగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణ పనులు మేరకు దఫ దఫాలుగా బిల్లులు చెల్లింపులు చేపట్టడం జరుగుతుందని, లబ్ధిదారులంతా నిర్దేశించిన సమయంలోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు.

డీఎల్‌పీఓ కార్యాలయం తరలింపునకు చర్యలు

పాలకొండ: పట్టణంలోని డీఎల్‌పీఓ కార్యాలయాన్ని పాత భవనాల నుంచి తరలించేందుకు చర్యలు తీసుకున్నామని డీఎల్‌డీఓ గోపాలకృష్ణ తెలిపారు. డీఎల్‌పీఓ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో సాక్షి పత్రికలో 'క్షణ క్షణం భయం భయం' శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణంలోని వెంకమ్మపేట సమీపంలో ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి కార్యాలయాన్ని తరలిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ రామప్రసాద్ మాట్లాడుతూ.. పాత భవనాల నుంచి సామగ్రి తరలిస్తున్నట్లు చెప్పారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం


పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గంతో ఎంపీడీవో

జియ్యమ్మవలస: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. బుధవారం వారంతా కలసి సమస్యలపై చర్చించుకున్నారు. ఎంపీడీవో కె.ధర్మారావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా ఎం.రామసత్యన్నారాయణ (టీకే జమ్ము కార్యదర్శి), అధ్యక్షులుగా రేవళ్ల సూర్యచరణ్ పండిట్ (తాళ్లడుమ్మ), ఉపాధ్యక్షులుగా ఎం.ప్రతాప్ (కేటీవాడ), ప్రధాన కార్యదర్శిగా ఎస్.సురేష్ (డంగభద్ర), కోశాధికారిగా ఎ.సత్యవతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డీడీ


టెన్త్ విద్యార్థులకు సూచనలిస్తున్న డీడీ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొత్తగూడ గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను పార్వతీపురం ఐటీడీఏ డీడీ ఆర్.కృష్ణవేణి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతూ చదువు పట్ల నిర్లక్ష్యం వహించవద్దన్నారు. పాఠాలు అర్థం కాకుంటే ఉపాధ్యాయుల్ని మరలా అడిగి తెలుసుకోవాలంటూ సూచించారు. ఆశ్రమ పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అనారోగ్యం బారిన పడిన విద్యార్థులకు తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందివ్వాలని ఆదేశించారు.

నేల తల్లిని కాపాడి ఆరోగ్యాన్ని పరిరక్షించుకుందాం


ద్రావణాలు, కషాయాల తయారీపై అవగాహన

గరుగుబిల్లి: నేల తల్లిని కాపాడితే తద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని బయో రిసెర్చ్ కేంద్రం(బీఆర్‌సీ) ఎన్‌పీఎంఎంటీ బీమారాజు అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ఆశ్రమంలో బయో రిసెర్చ్ కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రావణాలు, కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. పంటలలో కషాయాలు, ద్రావణాల వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం బీమారావు మాట్లాడుతూ రైతులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ప్రజారోగ్యాన్ని ప్రకృతి వ్యవసాయంతో కాపాడాలన్నారు. గ్రామాలలో బయో రిసెర్చ్ కేంద్రాల ద్వారా పంటల సాగుకు అవసరమైన ద్రావణాలు, కషాయాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు, రిసోర్సుపర్సన్లు పాల్గొన్నారు.

కోటదుర్గ ఆలయ అభివృద్ధికి సహకరించండి

- సబ్ కలెక్టర్‌ను కోరిన ఈఓ, తదితరులు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన పల్లా కొండలరావు, ఆలయ ఈఓ సూర్యనారాయణ కోరారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయానికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనికి సబ్ కలెక్టర్ స్పందిస్తూ ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కురుపాం: గిరిజన యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠారావు సూచించారు. మండలంలోని గుజ్జువాయి గ్రామ పంచాయతీ సచివాలయం వద్ద నీలకంఠాపురం ఎస్ఐ ఎ.నీలకంఠారావు మంగళవారం రాత్రి పల్లెనిద్ర నిర్వహించారు. అనంతరం గ్రామ యువత, ప్రజలకు చెడు వ్యసనాలు వలన కలిగే అనర్థాలు, సైబర్ క్రైమ్ నేరాలు, రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బుధవారం ఉదయం నీలకంఠాపురం ప్రధాన రహదారి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేనటువంటి వాహనదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి

సీతంపేట: ట్రైబల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న పది మంది ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి కల్పించినట్లు డీడీ అన్నదొర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ కల్పించామని పేర్కొన్నారు.

అవగాహనతో అధిగమిద్దాం..


కళామందిర్ థియేటర్ వద్ద అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాలను అవగాహనతో అధిగమిద్దామని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక సినిమా థియేటర్ల వద్ద ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆధునిక పరికరాలతో మంటలను ఎలా అదుపు చేయాలో వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నీరు పోయాక ఎరువులు వేయాలి

భామిని: పొలాల్లోని నీరు బయటకు పంపించిన తర్వాతే ఎరువులు వేయాలని కేవీకే శాస్త్రవేత్తలు ధృవ, శ్రీనివాస్‌రాజు అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ముంపునకు గురైన వరి, పత్తి పంటలను బుధవారం వారు పరిశీలించారు. స్థానిక ఏఓ కొల్లి తిలక్‌తో కలిసి మండలంలోని బాలేరు, ఘనసర, లివిరి, నులకజోడు గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు.

మెరుగైన విద్య, ఆరోగ్యం అవసరం


దుడ్డుఖల్లు ఆశ్రమ పాఠశాలలో స్టోర్‌రూమ్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూవో

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు మెరుగైన విద్యనందివ్వడం, సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండేలా చూసుకోవడం అవసరమని ఏటీడబ్ల్యూవో ఎల్.రజని అన్నారు. మండలంలోని దుడ్డుఖల్లు, దొరజమ్ము, బీరుపాడు గ్రామాల్లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడి హెచ్.ఎం, డిప్యూటీ వార్డెన్, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మెరుగైన విద్యనందించేందుకు చేపడుతున్న చర్యలపై దిశా నిర్దేశం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనారోగ్యం బారిన పడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలంటూ పలు సూచనలు చేశారు.

350 మంది దివ్యాంగుల పింఛన్ల నిలిపివేత

గరుగుబిల్లి: మండలంలోని దివ్యాంగుల పింఛన్లు అందుకుంటున్న 1,256 మందిలో 350మందిని అనర్హులుగా గుర్తించి వారికి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇటీవల వైద్య బృందం చేపట్టిన సదరం సర్టిఫికెట్లు పరిశీలన, వైకల్య శాతం తనిఖీల అనంతరం 350 పింఛన్లను నిలుపుదల చేశారు. తొలగించిన వీరికి సెప్టెంబర్ నెల నుంచి పింఛన్లను నిలిపివేస్తున్నారు. దీంతో పింఛన్ పొందుతున్న దివ్యాంగులలో ఆందోళన నెలకొంది. దీంతో పింఛన్ పొందుతున్న దివ్యాంగులపై ప్రభుత్వం కక్ష కట్టిందని పలువురు ఆరోపిస్తున్నారు. పింఛన్ కోల్పోయిన వారు తమ ఆధార్ కార్డు, పాత సదరం ధృవీకరణ పత్రం, కొత్తగా మంజూరైన సదరం ధృవపత్రం, నోటీసుతో కలిపి ఎంపీడీవో కార్యాలయంలో అప్పీలు చేసుకోవాలని అధికారులు సూచించారు.

గుమ్మిడిగెడ్డ అక్విడెక్టులోకి వరద నీరు


గుమ్మిడిగెడ్డ అక్విడెక్టు మీదుగా వృథాగా పోతున్న వరద నీరు

కురుపాం: మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న గుమ్మిడిగెడ్డ అక్విడెక్టులోకి అల్పపీడనంతో కురిసిన వర్షాలతో ఏజెన్సీ గిరిశిఖరాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుంది. అయితే నీటిని నిలుపుదల చేసేందుకు అక్విడెక్టుకు తలుపులు లేకపోవడంతో వృథాగానే సాగు నీరు పోతుందని ఆ పరిధిలో ఉన్న సుమారు పది గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా గుమ్మిడిగెడ్డ అక్విడెక్టును పట్టించుకొనే నాధుడే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుమ్మిడిగెడ్డ అక్విడెక్టు పైనే మినీ రిజర్వాయర్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం హామీ కూడా ఇచ్చిందని, ఏ మేరకు కార్యరూపం దాలుస్తోందో వేచి చూడాలని రైతులు పేర్కొంటున్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం సాంబర

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు హెచ్‌ఎం బి.సాంబర భౌతిక శాస్త్ర స్టడీ మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు లక్ష్మణరావు స్టడీ మెటీరియల్‌ను రూపొందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అన్ను వెంకటరావు, జి.రామారావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన


బీజేపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా నోడల్ అధికారి అంకిత

జియ్యమ్మవలస: మండలంలోని బీజేపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శక్తి యాప్‌పై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు.బహిరంగ ప్రదేశాల్లో,పాఠశాల ఆవరణలో,కాలేజీ అవరణలో విద్యారర్థులకు ఈవ్‌టీజింగ్ చేయడం,ఆడపిల్లలను ఇబ్బంది పెట్టడం వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే శక్తి యాప్ ద్వారా వారిని నిరోధించవచ్చని జిల్లా నోడల్ అధికారి అంకిత సరియాన అన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. సైబర్ క్రైం 1930, పోక్సో యాక్ట్ మొదలైన వాటిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దీనితో పాటు ప్రతి విద్యార్థికి శక్తి యాప్ డౌన్లోడ్, రిజిస్ట్రేషన్ చేయించి టోల్ ఫ్రీ నంబరు 112, వాట్సాప్ నంబరు 7993485111కి కాల్ చేసి అందులో ఫీచర్స్‌ను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసరావు, హెచ్‌సీ గురుమూర్తి, నిర్మల తదితరులున్నారు.

మర్యాదపూర్వక కలయిక..



పాలకొండ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పవర్‌స్వప్నిల్ జగన్నాథ్‌ను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే విషయంలో తమ సహకారం ఉంటుందని పీఓకు తెలియజేశారు. – పాలకొండ